అద్దె భవనాల్లో అవస్థలు

- కొన్నేళ్లుగా కిరాయి భవనాల్లోనే ప్రభుత్వ కార్యాలయాలు
- ఎంఆర్‌సీ భవనంలో ఎంపీడీఓ కార్యాలయం
- అవస్థలు పడుతున్న అధికారులు, ప్రజలు



ఇరుకు గదుల్లో నిర్వహిస్తున్న తహసీల్దార్ కార్యాలయం(ఫైల్)

ఉండవెల్లి: మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేక ఇటు అధికారులు, అటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం ఏర్పాటైనప్పటి నుంచి తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్, వ్యవసాయశాఖ కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. తహసీల్దార్ కార్యాలయం నుంచి లక్షలాది రూపాలయల ఆదాయం వస్తున్నా వసతుల కొరత మాత్రం తీరడం లేదని అధికారులు వాపోతున్నారు.

2016 నుంచి కిరాయి భవనంలోనే..

మండల కేంద్రంగా 2016లో ఏర్పాటైనప్పటి నుంచి తహసీల్దార్ కార్యాలయం కిరాయి భవనంలోనే కొనసాగుతుంది. ఇరుకు గదుల్లో అసౌకర్యాల మధ్య కాలం వెళ్లదీస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎమ్మార్సీ భవనం ప్రారంభించారు . కానీ ఎంపీడీఓ కార్యాలయం గోదాంలో ఉండడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంఆర్‌సీ భవనంలో ఎంపీడీఓ కార్యాలయం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఎంఆర్‌సీలకు నూతన ఎంఈఓలను నియమించడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో సమావేశాలు..

ఎంఆర్‌సీ భవనంలో ఎంపీడీఓ కార్యాలయం ఏర్పాటు చేయడంతో ఉపాధ్యాయులు అలంపూర్ చౌరస్తాలోని ప్రైవేటు పాఠశాలలోనే సమావేశాలు నిర్వహిస్తున్నారు. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రంలోనే అన్ని సమావేశాలు, కార్యాలయాలు నిర్మించాలని కోరుతున్నారు. అద్దె భవనంలో కొనసాగుతున్న పోలీసు స్టేషన్ ఖాళీ చేయాలని భవన యజమాని కోర్టు నోటీసులు జారీ చేయడంతో పోలీసులు పలు స్థలాలను పరిశీలించారు. అవి కాస్త రాజకీయం కావడంతో నాయకులు, గ్రామ పెద్దల జోక్యంతో ప్రస్తుతం అద్దె భవనంలోనే కొనసాగుతోంది.

ఆగిన మహిళా సమాఖ్య భవన నిర్మాణం..

మహిళా సంఘాలతో సమావేశాలు నిర్వహించేందుకు కార్యాలయ నిర్మాణం మొదలైన నాలుగేళ్లుగా పిల్లర్ దశలో నిలిచింది. పీఏసీఎస్ గోదాములో నిర్వహిస్తుండటంతో సమావేశాలు నిర్వహించడానికి తీవ్ర ఇబ్బందిగా మారిందని వారు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అద్దె భవనాల్లో ఉండే ప్రభుత్వ కార్యాలయాలు మండల కేంద్రంలో అందరికీ అందుబాటులో ఉండే విధంగా సొంత భవనాలు ఏర్పాటు చేయాలని అధికారులు, ప్రజలు కోరుతున్నారు.


ఎంఆర్‌సీ భవనంలో ఎంపీడీఓ కార్యాలయం

కార్యాలయాన్ని అప్పగించాలి..



ఎంఆర్‌సీ భవనంలో ఎంపీడీఓ కార్యాలయం ఏర్పాటు చేశారు. దీంతో ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహించేందుకు తీవ్ర ఇబ్బందిగా మారింది. సమావేశాలు ప్రైవేటు పాఠశాలల్లో నిర్వహించాల్సి వస్తుంది. ఎంఆర్‌సీ భవనాన్ని తిరిగి కేటాయించాలి. ఉన్నతాధికారులకు సమస్యను తెలియజేశాం.

-రామకృష్ణ ఎంఈఓ, ఉండవెల్లి

క్లుప్తంగా

తహసీల్దార్‌గా బాధ్యతల స్వీకరణ



కేటీదొడ్డి: మండల తహసీల్దార్‌గా హరికృష్ణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీలో భాగంగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్న షాహిదాబేగం మల్దకల్‌కు బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన హరికృష్ణకు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రెవెన్యూ, మీసేవ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ భర్త దౌర్జన్యం

ధరూరు: తన ఇంటి స్థలాన్ని మాజీ సర్పంచ్ భర్త శ్రీరాములు ఆక్రమించి ఇల్లు కట్టేందుకు ప్రయత్నిస్తున్నాడని మార్లబీడు గ్రామానికి చెందిన కుర్వ శివరాజు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశాడు. సర్వే నంబర్46/ఇ2లో ఉత్తర దక్షిణం 120 ఫీట్లు, తూర్పు పడమర 60 ఫీట్లు స్థలాన్ని గతంలో గ్రామానికి చెందిన సర్గీయ కుమ్మరి రంగన్న వద్ద రూ.1,500 కొనుగోలు చేశామని, అందుకు తగిన సాదా కాగితాలు కూడా ఉన్నాయని తెలిపారు. గ్రామంలో ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉన్న ఈ స్థలంపై గ్రామ తాజా మాజీ సర్పంచ్ శ్రీరాములు కన్నేసి కబ్జాకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. న్యాయం చేయాలని తహసీల్దార్‌ను కోరారు.

ఏఐసీసీ కార్యదర్శి ప్రత్యేక పూజలు



అయిజ: మండల కేంద్రంలోని వీరబ్రంహ్మేంద్ర స్వామి ఆలయంతోపాటు తిక్క వీరేశ్వర స్వామి ఆలయాన్ని ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు.

పంచలోహ విగ్రహాల వితరణ



రాజోళి: మండల కేంద్రంలో కొలువైన భ్రమరాంబ ఆదివేశ్వర స్వామి ఆలయానికి స్వామి అమ్మవార్ల పంచలోహ విగ్రహాలను స్థానిక దాతలు మంగళవారం వితరణ చేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులకు ఆలయ కమిటీ సభ్యులు అభినందనలు తెలియజేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



మానవపాడు: విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని ఎంఈఓ శివప్రసాద్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చంద్రశేఖర్‌నగర్ గ్రామంలోని పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నాణ్యతపై ఆరాతీశారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు నుంచి కర్నూల్‌కు ఆటోలో తరలిస్తున్న 1.5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని బ్లూకోర్ట్సు పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం పీడీఎస్ బియ్యాన్ని పుల్లూరు కర్నూలుకు అక్రమంగా ఆటోలో తరలిస్తుండగా పుల్లూరు శివారులో పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. బియ్యం సీజ్ చేసి ఆటో డ్రైవర్ నాగేంద్రంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు.

బహుజన నాయకులను టార్గెట్ చేసింది


సాతర్లలో మాట్లాడుతున్న బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు

ఇటిక్యాల: కాంగ్రెస్ పార్టీ బహుజన నాయకులను టార్గెట్ చేసిందని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు అన్నారు. మండల పరిధిలోని సాతర్ల గ్రామంలో మంగళవారం పార్టీ కార్యకర్తలతో కలసి ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగ పితామహుడు డా.బీఆర్ అంబేడ్కర్‌ను అడుగడుగున అవమానించిన కాంగ్రెస్ నేడు బహుజన నాయకులను టార్గెట్ చేసిందని ధ్వజమెత్తారు. బహుజన్ సమాజ్ పార్టీ చీఫ్ బెహెన్ మాయావతిని చంపేయాలన్నా కాంగ్రెస్ నేత ఉదిత్ రాజును తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీకి దళితులపై ఏమాత్రం చిత్తశుద్ధి లేదన్నారు. దళితులపై కపట ప్రేమ మాత్రమే చూపిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆదాం, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

దళితోద్ధారకుడు భాగ్యారెడ్డివర్మ


చిట్యాలలో భాగ్యారెడ్డి వర్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

వనపర్తిటౌన్: అంబేద్కర్ కంటే ముందే దళిత వర్గాలను చైతన్యం చేసేందుకు పోరాడిన దళితోద్ధారకుడు భాగ్యారెడ్డి వర్మ అని ప్రజావాగ్గేయకారుడు రాజారాంప్రకాశ్ అన్నారు. భాగ్యారెడ్డివర్మ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం మహనీయుల స్ఫూర్తి వేదిక ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో గిరిరాజాచారి, నాయకంటి నరసింహశర్మ, నాగరాజు, శివశంకర్, వెంకటస్వామి, కృష్ణయ్య, గంగాధరచారి, నాగరాజుచారి తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి రూరల్: మండలంలోని చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు భాగ్యారెడ్డివర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వరదాచారి, వెంకటేశ్వరగుప్తా, రుద్రమదేవి, రవి, సంజీవయ్య, షఫీ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మ చల్లంగ చూడమ్మ


క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

ఉండవెల్లి: మండలంలోని కంచుపాడు గ్రామంలోని రేణుక ఎల్లమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. మంగళవారం అమ్మవారికి ప్రత్యేకంగా కుంకుమ పూజలు, అర్చనలు చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. తీర్థప్రసాదాలు స్వీకరించి మొక్కులు సమర్పించారు. భక్తుల రాకతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. కార్యక్రమంలో నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణ పరమహంసకు నివాళి


నివాళులర్పిస్తున్న సేవా సమితి సభ్యులు

ఆత్మకూర్: రామకృష్ణ పరమహంస జయంతిని పురస్కరించుకొని స్వామి వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో మంగళవారం వివేకానంద విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేష్, దివాన్జీ ప్రభాకర్ రావు, తాల్లపల్లి నాగరాజు, వెంకటనర్సింహారావు, మణివర్ధన్‌రెడ్డి, నాగేశ్వర్, నర్సింహ, బాలకృష్ణ, బాలు, రాజేష్, సూరి, రాము, వెంకటేష్ తదితరులు ఉన్నారు. త

మునిరంగస్వామికి ప్రత్యేక పూజలు


విద్యుత్ దీపాలతో అలంకరించిన దేవాలయం


ఆభరణాలతో అలంకరించిన మునిరంగస్వామి

భూత్పూర్: పట్టణంలోని శ్రీమునిరంగస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన మునిరంగస్వామి పట్టణంలోని ఇంటింటికి వెళ్లడం ఆనవాయితీ. దేవాలయానికి రాని భక్తుల సౌకర్యార్థం స్వయంగా మునిరంగస్వామి ప్రతిమను ఊరేగింపుగా, భజనలతో ఇంటింటికి వెళ్లి భక్తులకు సాహిత్యం (నైవేద్యం)తో అన్నదానం చేస్తారు. మునిరంగస్వామి దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. జాతరలో దుకాణాలతో పాటు బ్రేక్ డ్యాన్స్, కొలంబర్, జంపింగ్‌లు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. భూత్పూర్‌కు చెందిన టి. మురళీధర్‌గౌడ్ ప్రతి ఏటా బ్రహ్మోత్సవాల్లో అన్న ప్రసాదం (అన్నదానం) చేస్తున్నారు. భక్తుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు దేవాలయ కమిటీ నిర్వహించింది.

శివస్వాములకు అన్నదానం



ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో శివరాత్రి సందర్భంగా శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్లే శివస్వాములకు అన్నదాన కార్యక్రమం ఆలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ ధర్మకర్త దామోదర్ రెడ్డి ప్రత్యేక పూజల అనంతరం కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో శివ మాలాధారులు, భక్తులు పాల్గొన్నారు.

ఇసుకను ఉచితంగా సరఫరా చేయాలని వినతి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఇసుకను ఉచితంగా సరఫరా చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వరదగాలన్న ఆధ్వర్యంలో భవన నిర్మాణ రంగ కార్మికులు మంగళవారం కలెక్టర్ విజయేందిర బోయికి వినతిపత్రం సమర్పించారు. జిల్లాలో ఇసుకను బడుగు బలహీనవర్గాలకు, ఇందిరమ్మ ఇళ్లకు ఉచితంగా సరఫరా చేయాలని కోరారు. జిల్లాలో డీసీఎల్ ఆఫీసులో పెండింగ్‌లో ఉన్న కార్మికుల క్లెయిమ్‌లను తక్షణమే పరిష్కరించాలని, వెల్ఫేర్ బోర్డులో అడ్వైజర్ సభ్యులుగా అన్నికార్మిక సంఘాల నుంచి నియమించాలన్నారు. వెల్ఫేర్ బోర్డులో జరుగుతున్న అవినీతిని అరికట్టాలని అన్నారు. సమస్యల పరిష్కారానికి కలెక్టర్ డీసీఎల్‌తో చర్చించాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కంకర కష్టయ్య, నల్లవెల్లి కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను మరింతగా తీర్చిదిద్దాలి


విద్యార్థులతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి సుమిత్ అరోరా

ధరూరు: విద్యార్థులను మరింత తీర్చిదిద్దాలని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి సుమిత్ అరోరా అన్నారు. మండల పరిధిలోని ఉప్పేరు ఉన్నత పాఠశాలలో బ్యూటీ అండ్ వెల్‌నెస్ ఒకేషనల్ కోర్సు సంబంధించిన ప్రాక్టికల్స్‌ను ఆయన ప్రారంభించినట్లు మంగళవారం ప్రధానోపాధ్యాయుడు గౌరీ శంకర్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల నైపుణ్యాలు, రికార్డులు పరిశీలించారు. వైవా అడిగి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులను మరింతగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయురాలు కవితకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట



సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులతో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రజా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గానికి సంబంధించి 128మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు కార్పొరేట్ వైద్యం అందించే ఉద్దేశంతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేసుకున్నవారికి సీఎం రిలీఫ్ ఫండ్ అందిస్తున్నట్లు తెలిపారు. రూ.5లక్షలుగా ఉన్న రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.10లక్షలకు పెంచారన్నారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, నాయకులు మహేందర్, సాయిబాబా, అజ్మత్‌అలీ, రాములు యాదవ్, ఖాజాపాషా, రాషెద్‌ఖాన్, ప్రశాంత్, అంజద్, బండి మల్లేష్, అష్ఫాక్, మొయిజ్, రఘు, మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు బాండ్ల అందజేత


బాండ్లను అందిస్తున్న వీసీ శ్రీనివాస్, తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ(పీయూ)లో నాన్‌టీచింగ్ ఉద్యోగులుగా పనిచేసి ఇటీవలే రాజశేఖర్, దశాదేవి మరణించారు. రాజశేఖర్ భార్య సుకన్య, దశాదేవి భర్త సుభాష్‌గౌడ్‌కు ఒక్కొక్కరికి రూ.3.50లక్షలకు సంబంధించిన బాండ్లను వీసీ శ్రీనివాస్, రిజిస్ట్రార్ చెన్నప్ప మంగళవారం అందించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ పీయూలో సిబ్బందికి ఇబ్బందులు వస్తే ఆదుకుంటామని, వారి సంక్షేమానికి కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రకిరణ్, ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, బోధనేతర సంఘం అధ్యక్షుడు రామ్మోహన్, పర్వతాలు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం


నాగర్‌దొడ్డిలో విద్యార్థులతో ఉపాధ్యాయులు


మానవపాడులో స్వయం పరిపాలన దినోత్సవంలో విద్యార్థులు

మానవపాడు: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు బోధన చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ శివప్రసాద్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు రామూర్తి, ఉపాధ్యాయులు లక్ష్మన్న, వేణుగోపాల్, మద్దిలేటి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధరూరు: మండల పరిధిలోని నెట్టెంపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ అనుభవాలు పంచుకున్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం గౌరీశంకర్, హెచ్ఎం రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మల్దకల్ : మండలంలోని నాగర్‌దొడ్డి పాఠశాలలో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాఘవేంద్ర గుప్తా ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు అండగా.. రక్షణ మెండుగా

- మహిళా సాధికారత సాధించడమే లక్ష్యం
- 'బేటీ బచావో.. బేటీ' పడావోకు పదేళ్లు
- లింగ వివక్షకు వ్యతిరేకంగా అవగాహన సదస్సులు
- మార్చి 8 వరకు వివిధ కార్యక్రమాలు


జోగులాంబ గద్వాల జిల్లాలో అవగాహన కల్పిస్తున్న అధికారులు(ఫైల్)

మానవపాడు: మహిళకు గౌరవం లభించిన చోట దేవతలు సంచరిస్తారు, సమస్త శుభాలను కలిగిస్తారంటూ ప్రాచీన కాలంలోనే మన సంస్కృతిలో మహిళలకు సమున్నత స్థానం కల్పించారు. కానీ నేడు దాడులు, అత్యాచారాలు, గృహహింస తదితర చర్యలతో మహిళలు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో మహిళల రక్షణ, సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేక చర్యలు చేపట్టాయి. కళాశాలలు, పాఠశాలలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాయి. లింగ వివక్షతను రూపుమాపి మహిళా సాధికారతను సాధించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 2015 జనవరి 22న బేటీ బచావో బేటీ పడావో (ఆడపిల్లలను రక్షించండి... ఆడపిల్లలను చదివించండి) అనే పథకాన్ని ప్రారంభించింది. అయితే పథకం ప్రారంభించి పదేళ్లు పూర్తియిన సందర్భంగా బాలికల సంరక్షణ, స్త్రీ సాధికారత, లింగ వివక్షకు వ్యతిరేకంగా జిల్లాలో పౌరులను విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

చట్టాలు... శిక్షలు

జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో గత నెల 27 నుంచి ప్రారంభమైన కార్యక్రమాలు మార్చి 8వ తేదీ వరకు కొనసాగనున్నాయి. బాలికల చట్టాలు, లింగ వివక్ష, విద్యాలయాల్లో గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర అంశాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సమస్యలు తలెత్తినపుడు 181 హెల్ప్‌లైన్‌లో ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు. ఇందుకోసం విద్యాశాఖ అధికారులతో చర్చిస్తున్నారు. అలగే బాల్య వివాహం, లైంగిక వేధింపులు, వరకట్న వేధింపులు, లింగ నిర్ధారణ, భ్రూణ హత్యలు వంటి అకృత్యాలకు పాల్పడిన వారిపై చట్టపరంగా ఇబ్బందులు తప్పవని హెచ్చరిస్తున్నారు. పాఠశాలలో, కళాశాలల్లో విద్యా బుద్ధులు నేర్పాల్సిన గురువులు బాలికలను బ్యాడ్ టచ్ చేసినా, ఎలాంటి శిక్ష ఉంటుందనే దానిపై జిల్లా సాధికారత కేంద్రం లీగల్‌సెల్ అథారిటీ (న్యాయశాఖ)ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. కళాశాలలు, పాఠశాలల్లో తోటి విద్యార్థినులను లైంగికంగా వేధిస్తే జరగబోయే పరిణమాలు, అందుకు శిక్షల గురించి బాలురకు న్యాయ నిపుణులతో వివరిస్తున్నారు.

గ్రామస్థాయిలో పర్యటించాలి..



గ్రామాల్లో ఉన్నత స్థాయి అధికారులు పర్యటించి పూర్తిస్థాయిలో బాలికల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి. ముఖ్యంగా కళాశాలలు, పాఠశాలల్లో ఆడపిల్లల రక్షణపై అవగాహన కలిప్ంచాలి. వేధింపులపై అవగాహనతోనే సమాజంలో మార్పు వస్తుంది.

-లక్ష్మీదేవి, మాజీ సర్పంచ్, మద్దూరు

విస్తృతంగా అవగాహన..

బేటీ బచావో బేటీ పడావో పథకం ప్రారంభమై పదేళ్లు పూర్తయిన నేపథ్యంలో మార్చి 8వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. జిల్లా మహిళా సాధికారతకు కేంద్రం ఆధ్వర్యంలో వివిధ శాఖల సమన్వయంతో కళాశాలలు, కేజీబీవీలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. అదే విధంగా లీగల్‌సెల్ అథారిటీ ఆధ్వర్యంలో న్యాయమూర్తులతో అవగాహన కల్పిస్తున్నాం.

-జ్యోష్న, జిల్లా మిషన్ కోఆర్డినేటర్